
సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
శుక్రవారం । 13 । అక్టోబర్ । 2023



అన్నదాన భవన నిర్మాణానికి విరాళం

ఆత్రేయపురం: వాడపల్లి వెంకన్న ఆలయంలో వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి బళ్ల తాతారావు, నాగమణి దంపతులు గురువారం రూ 1,00,001 విరాళం అందజేశారు.



కాలువలకు నీరు విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజ్ నుంచి గురువారం తూర్పు డెల్టాకు 4,800,మధ్య డెల్టాకు 2,300,పశ్చిమ డెల్టాకు 7వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



అన్నవరం: సత్యదేవు ని నిత్యాన్నదాన పథకానికి కాకినాడకు చెందిన భావరాజు సరస్వతి రూ.లక్ష విరాళాన్ని గురువారం సమర్పించారు. ఈ మొత్తంపై వచ్చే వడ్డీతో ఏటా ఆశ్వీయుజ తృతీయ నాడు భావరాజు వేంకట సూర్యనారాయణమూర్తి పేరు మీద అన్నదానం చేయమని దాత కోరినట్లు అధికారులు తెలిపారు.



సీఎం జగన్ సభకు హాజరైన అశేష జనవాహినిలో ఒక భాగం





సీఎం వైఎస్ జగన్‌కు జ్ఞాపికను బహూకరిస్తున్న ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నాయకులు

జన సునామీ

- కట్టిపడేసిన ప్రసంగం
- చంద్రబాబు, పవన్‌లకు చలోక్తులతో చురకలు
- సభ విజయవంతంతో పార్టీ శ్రేణుల్లో జోష్



గృహప్రవేశం చేసిన కుటుంబీకులతో జగన్



జగనన్నను చూడగానే పెల్లుబికిన ఆనందోత్సాహం



గృహప్రవేశం చేయిస్తున్న సీఎం జగన్

సామర్లకోట నుంచి సాక్షి ప్రతినిధి: కాకినాడ జిల్లాలోని జంట మున్సిపాలిటీలు పెద్దాపురం, సామర్లకోట పట్టణాలు గురువారం జనసునామీని తలపించాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పర్యటన సందర్భంగా తరలివచ్చిన జనసందోహంతో ఉదయం నుంచీ సామర్లకోట పరిసర ప్రాంతాలు కిక్కిరిసిపోయాయి. ఎటు చూసినా జగన్ నినాదాలే ప్రతిధ్వనించాయి. పెద్దాపురం – సామర్లకోట, సామర్లకోట – కిర్లంపూడి రోడ్లలో ఇసుక వేస్తే రాలని స్థాయిలో జనప్రవాహం కనిపించింది. ముఖ్యమంత్రి సామర్లకోట చేరడానికి అరగంట ముందే జూనియర్ కాలేజీలోని సభాస్థలిలో గ్యాలరీలన్నీ జనంతో నిండిపోయాయి. పలువురు మహిళలు సభా ప్రాంగణంలోకి వెళ్లే అవకాశం లేక రోడ్ల పైనే నిలుచుండిపోయారు. నడినెత్తిన సూరీడు నిప్పులు చెరుగుతున్నా లెక్క చేయకుండా సీఎం ప్రసంగాన్ని అక్కడి నుంచే ఆలకించారు.

అపూర్వ స్వాగతం

తొలుత సామూహిక గృహ ప్రవేశాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సామర్లకోట ఈటీసీ లేఅవుట్‌లో శ్రీకారం చుట్టారు. తాడేపల్లి నుంచి ఉదయం హెలికాప్టర్‌లో వచ్చిన ఆయన ప్రైవేటు స్థలంలో ఏర్పాటు చేసిన హెలిపాడ్‌లో దిగారు. అక్కడి నుంచి భారీ జనసందోహం వెంట రాగా ఆర్టీసీ ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సులో జగనన్న లేఅవుట్‌కు చేరుకున్నారు. గృహప్రవేశాల్లో పాల్గొని లబ్ధిదారులైన మహిళలతో మమేకమయ్యారు. ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న సొంతింటి కలను సాకారం చేసిన సీఎంతో మహిళలు తమ సంతోషాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా వారిని ఆత్మీయంగా పలకరించి, కుటుంబ పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. మహిళలు ఇరువైపులా ఎదురెళ్లి మరీ పూలవర్షంతో సీఎంకు అపూర్వ స్వాగతం పలికారు.

చేసిన మంచి చెబుతూ..

తన ప్రభుత్వం చేసిన మంచిని సమగ్రంగా వివరిస్తూ.. ప్రత్యర్థుల కుట్రలను ఎండగడుతూ సుమారు గంట పాటు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేసిన ప్రసంగం ఆద్యంతం ప్రజలను ఆకట్టుకుంది.. ఆలోచింపజేసింది. చంద్రబాబు, పవన్ కల్యాణ్‌ల అపవిత్ర పొత్తుల దగ్గర నుంచి దోపిడీ కోసమే అధికారం కావాలని వారు వెంపర్లాడుతున్న వైనాన్ని ముఖ్యమంత్రి ఎండగట్టారు. చంద్రబాబు మూడు సార్లు సీఎంగా చేసినా, 35 ఏళ్ల ప్రాతినిధ్యం వహించిన కుప్పం నియోజకవర్గానికి కూడా ఒరిగిందేమీ లేదంటూ దుమ్ము దులిపేశారు. ప్రజాసంకల్ప పాదయాత్రలో తాను ఇచ్చిన వాగ్దానాలు, ఎన్నికల ముందు ప్రకటించిన మేనిఫెస్టోను నాలుగున్నరేళ్లలో 99 శాతం పూర్తి చేసిన అంశాన్ని.. చేకూర్చిన మంచిని గణాంకాలతో ఇట్టే అర్థమయ్యే రీతిలో విడమర్చి చెప్పారు. ఆయన ప్రసంగానికి జనం నుంచి చక్కటి స్పందన లభించింది. 35 సంవత్సరాలుగా రాజకీయాల్లో ఉండి, మూడుసార్లు సీఎంగా చేసినా సెంటు జాగా కూడా ఇవ్వని చంద్రబాబు తీరును ఎండగట్టినప్పుడు అదంతా నిజమే కదా నిజమే కదా అంటూ పెద్ద ఎత్తున జనం గొంతు కలిపారు. పంచ్ డైలాగులతో చంద్రబాబు, పవన్ కల్యాణ్‌ల తీరును సీఎం కడిగిపారేశారు. 'చంద్రబాబు దత్తపుత్రుడు పవన్ స్టోరీ మీకు తెలుసు కదా!' అంటూ చలోక్తులతో ఎండగట్టారు. 'దత్తపుత్రుడు పవన్ ఇల్లు శాశ్వతంగా హైదరాబాద్‌లోనే. ఇంట్లో ఇల్లాలు మాత్రం ప్రతి మూడు నాలుగేళ్లకు మారిపోతుంది. ఒకసారి లోకల్, మరోసారి నేషనల్, ఇంకోసారి ఇంటర్నేషనల్. ఆ తరువాత ఎక్కడికి పోతాడో ఏమో!' అన్నప్పుడు జనం ఒక్కసారిగా ఈలలు, చప్పట్లతో హోరెత్తించారు.

బాబును చూస్తే స్కాములు.. జగన్‌ను చూస్తే స్కీములు గుర్తొస్తాయి

వైఎస్సార్ సీపీ పెద్దాపురం కో ఆర్డినేటర్ దవులూరి దొరబాబు నియోజకవర్గాన్ని అంటిపెట్టుకుని ఉంటున్నారంటూ సీఎం జగన్ కితాబు ఇవ్వడంతో జనం 'జై జగన్, జై దొరబాబు' అంటూ నినదించారు. పవన్ కల్యాణ్ మాదిరిగా పోటీ చేసిన నియోజకవర్గాలను గాలికొదిలేయకుండా నియోజకవర్గ అభివృద్ధికి దొరబాబు తపన పడుతున్నారని, లీడర్ అంటే ఇలా ఉండాలని - మిగతా 8లో▸

నాడు మహానేత.. నేడు జననేత..

– దవులూరి దొరబాబు, రాష్ట్ర గృహ నిర్మాణశాఖ చైర్మన్



గతంలో దివంగత ముఖ్యమంత్రి, మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా గృహనిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో రాజీవ్ గృహకల్పను ప్రారంభించి ఇదే ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో బహిరంగ సభలో పాల్గొన్నారు. ప్రస్తుతం అదే శాఖ ఆధ్వర్యంలో జగనన్న కాలనీ ప్రారంభించి ఇదే ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రసంగించడం, గృహ నిర్మాణ సంస్థకు రాష్ట్ర చైర్మన్‌గా నేను ఉండటం నా అదృష్టం. జీవితాంతం జగన్‌మోహన్‌రెడ్డితోనే పయనిస్తా. గడప గడపకూ మన ప్రభుత్వంలో అనేక మంది టీడీపీ నాయకులకు అందుతున్న సంక్షేమ పథకాలపై ఆ పార్టీ నేతలు జగన్‌మోహన్‌రెడ్డికే తమ మద్దతు అని భరోసా ఇస్తున్నారు. రాష్ట్రంలో 175 స్థానాల్లో వైఎస్సార్ సీపీ విజయం సాధిస్తుంది. నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని కోరాను. సచివాలయాల పరిధిలో గడప గడపకూ రెండు పర్యాయాలు పర్యటిస్తే రూ.40 లక్షలు నిధులు ఇస్తామని ఆయన హామీ ఇచ్చారు.

మహిళల ఆత్మగౌరవాన్ని పెంచిన సీఎం



ఇల్లు అంటే ఇటుకలు, సిమెంట్ ఒక్కటే కాదు...అన్నింటికంటే మహిళల ఆత్మగౌరవానికి చిహ్నం. పేదలు తమ సంపాదనలో 40శాతం ఇంటి అద్దెలకే చెల్లించే పరిస్థితులున్నాయి. అటువంటి పరిస్థితులలో కాకినాడ జిల్లాలో గజం స్థలం దొరకడం గగనమైపోతోన్న రోజుల్లో స్థలం ఇచ్చి ఇల్లు కట్టించి సుమారు రూ.20 లక్షలు విలువైన ఆస్తిని ముఖ్యమంత్రి మహిళల చేతిలో పెట్టడం గొప్ప విషయం. అందుకే సీఎం మహిళా పక్షపాతిగా నిలిచారు.

– డాక్టర్ కృతికా శుక్లా, జిల్లా కలెక్టర్, కాకినాడ.

న్యూస్‌రీల్

సచివాలయాలు సేవా నిలయాలు



సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి పినిపే విశ్వరూప్

అల్లవరం: పౌరులకు సేవలను అందించేందుకు నిర్మిస్తున్న సచివాలయాలు సేవా నిలయాలని మంత్రి విశ్వరూప్ అన్నారు. ఎస్.పల్లిపాలెంలో సర్పంచ్ కొల్లు వెంకటరమణ అధ్యక్షతన గ్రామ సచివాలయ భవనం ప్రారంభోత్సవం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ సచివాలయాల్లో అన్ని రకాల సేవలను సిబ్బంది అందిస్తున్నారని తెలిపారు. అమలాపురం నియోజకవర్గ పరిధిలో నిర్మాణాలు పూర్తి చేసుకున్న సచివాలయాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. అల్లవరం మండలంలోని ప్రధాన రోడ్డు విస్తరణ పనులు శర వేగంగా సాగుతున్నాయని మంత్రి అన్నారు. తొలుత సచివాలయ భవనం శిలాఫలకాన్ని మంత్రి విశ్వరూప్ ఆవిష్కరించారు. ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కొనుకు గౌతమి, వైస్ ఎంపీపీ ముత్యాల వెంకటరామకృష్ణ, ఎంపీటీసీ సభ్యురాలు కర్రి సత్య, పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి వారి ఆలయ చైర్మన్ అంగాడి రామారావు, మండల పార్టీ అధ్యక్షుడు కొనుకు బాపూజీ, గృహ సారథుల కన్వీనర్ తిక్కా ప్రసాద్, తుని పార్టీ పరిశీలకులు చెల్లుబోయిన శ్రీను, సర్పంచ్‌లు సుందరనీడి సాయి, తిక్కిరెడ్డి శ్రీను, ఏఎంసీ డైరెక్టర్ ఈతకోట సతీష్, అగ్నికుల క్షత్రియ తాలుకా అధ్యక్షుడు పెమ్మాడి సాయి, ఫిషర్‌మెన్ సొసైటీ చైర్మన్ కేవీ రాజు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి రైఫిల్ షూటింగ్ పోటీలు

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రి ఇంటర్నేషనల్ స్కూల్‌లో రాష్ట్ర స్థాయి రైఫిల్ షూటింగ్ పోటీలు,రాష్ట్ర స్థాయి కిక్ బాక్సింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు రాజమహేంద్రి స్పోర్ట్స్ అకాడమీ చైర్మన్ టీకే విశ్వేశ్వరరెడ్డి తెలిపారు. గురువారం రాజమహేంద్రవరంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 28,29,30 తేదీలలో రాష్ట్ర స్థాయి రైఫిల్ షూటింగ్ పోటీలు జరుగతాయన్నారు. నవంబరు 18,19 తేదీలలో రాష్ట్ర స్థాయి కిక్ బాక్సింగ్ పోటీలు జరుగుతాయన్నారు. పాల్గొనదలచిన వారు కిక్ బాక్సింగ్ అసోసియేషన్‌ను సంప్రదించాలన్నారు. మరిన్ని వివరాలకు రాజమహేంద్రి ఇంటర్నేషనల్ స్కూల్ ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలన్నారు.



సామూహిక గృహ ప్రవేశాల శిలా ఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్సీ త్రిమూర్తులు

సొంతింటి కల సాకారం

- సోమేశ్వరంలో జిల్లా స్థాయి సామూహిక గృహ ప్రవేశాలు
- ఓర్వలేనితనంతోనే ప్రతిపక్షం విమర్శలు : ఎమ్మెల్సీ తోట

రాయవరం: పేదల తల రాతలు మార్చాలి..దేవుడు ఆర్థికంగా చిన్నచూపు చూసినా..వారిని ఉన్నత స్థానానికి తీసుకు రావాలని, వారికి సొంత గూడును ఏర్పాటు చేయాలన్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయం సామూహిక గృహ ప్రవేశాలతో సాకారమైంది. మాటలు కాదు..చేతలు చూపిస్తానన్న సీఎం జగన్ మాటలు నేడు కళ్లెదుట ఇళ్లు, ఊళ్ల రూపంలో సాక్షాత్కరిస్తున్నాయని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. రాయవరం మండలం సోమేశ్వరంలో జిల్లా స్థాయి సామూహిక గృహ ప్రవేశాల కార్యక్రమం గురువారం అట్టహాసంగా ప్రారంభమైంది. సర్పంచ్ ఆరిఫ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్సీ త్రిమూర్తులు మాట్లాడుతూ ప్రతిపక్ష నేతగా ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు పాదయాత్ర చేసిన సమయంలో ప్రజల కష్టాలను, కన్నీళ్లను స్వయంగా చూసిన సీఎం జగన్ పేదరికంపై కత్తి కట్టారన్నారు. ప్రతి పేదవాడికి సొంత గూడును ఏర్పాటు చేయాలన్న ఆశయానికి, భగవంతుడు ఆశీస్సులు కూడా తోడయ్యాయయన్నారు. సొంతిల్లు సమకూరడంతో పేదల కళ్లల్లో ఆనందం స్పష్టంగా కన్పిస్తోందన్నారు. సర్పంచ్ ఆరిఫ్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సహకారంతో గ్రామంలో జరిగిన అభివృద్ధిని వివరించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యురాలు నల్లమిల్లి మంగతాయారు, ఎంపీపీ నౌడు వెంకటరమణ, హితకారిణి సమాజం చైర్మన్ కాశి మునికుమారి, వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాధాకృష్ణ, మాజీ సర్పంచ్ కోట వెంకట్రావు మాట్లాడుతూ గత ప్రభుత్వానికి, ప్రస్తుత ప్రభుత్వానికి ఉన్న తేడాను గమనించాలని, మరోసారి జగనన్న ప్రభుత్వాన్ని ప్రజలంతా ఆశీర్వదించాలన్నారు.

తేడా గమనించండి

ఎన్నికల సమయంలో డబ్బుమూటలతో వచ్చే అలవాటు మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావుకే ఉందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజల సమస్యలు పరిష్కరిస్తూ..వారి ముఖంలో సంతోషం చూడడమే తనకు ఇష్టమన్నారు. వేగుళ్ల ఎమ్మెల్యేగా ఎన్నికైన నాటి నుంచి ప్రజా సమస్యలను పట్టించుకోలేదన్నారు. కరోనా సమయంలో ఆయన ప్రజలను పట్టించుకోలేదని విమర్శించారు.

జిల్లాలో 10,158 ఇళ్లు పూర్తి

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 10,158 ఇళ్ల నిర్మాణం పూర్తయి సామూహిక గృహ ప్రవేశాలు జరుపుకుంటున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ నుపూర్‌అజయ్ తెలిపారు. అర్బన్ ఏరియాలో 24,644 ఇళ్లు మంజూరు కాగా, 8,545 ఇళ్లు పూర్తయ్యాయని, రూరల్ ఏరియాలో 9,810 ఇళ్లు మంజూరు చేయగా, 1,613 ఇళ్లు పూర్తి అయ్యాయన్నారు. సోమేశ్వరంలో గ్రామంలో 136 ఇళ్లు మంజూరు కాగా, 105 ఇళ్లు పూర్తయి గృహ ప్రవేశాలు చేసుకున్నట్లు ఆమె తెలిపారు. జగనన్న కాలనీల్లో పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలు సమకూర్చినట్లు ఆమె తెలిపారు. రామచంద్రపురం ఆర్డీవో సింధుసుబ్రహ్మణ్యం, మండపేట మున్సిపల్ చైర్మన్ పతివాడ దుర్గారాణి, వైఎస్సార్ సీపీ రంపచోడవరం పరిశీలకుడు కర్రి పాపారాయుడు, వైఎస్సార్ సీపీ నేత వేగుళ్ల పట్టాభిరామయ్యచౌదరి, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సత్తి వెంకటరెడ్డి, ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యుడు కాళ్ల అప్పారావు, సొసైటీ చైర్మన్ నల్లమిల్లి వీర్రాఘవరెడ్డి పాల్గొన్నారు.

దసరాకు 50 ప్రత్యేక బస్సులు



ఆర్టీసీ డీఎం సత్యనారాయణమూర్తి

అమలాపురం రూరల్: దసరా సెలవుల నేపథ్యంలో హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం తదితర సుదూర ప్రాంతాల నుంచి స్వగ్రామాలకు వచ్చే ప్రయాణికుల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తోంది. అమలాపురం నుంచి 50 ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్టు డిపో మేనేజర్ చల్లా సత్యనారాయణమూర్తి వెల్లడించారు. స్థానిక డిపోలో గురువారం ప్రత్యేక బస్సులపై అధికారులతో జరిగిన సమీక్షలో ఆయన మాట్లాడారు. అమలాపురం నుంచి రోజూ హైదరాబాద్‌కు 16 సాధారణ సర్వీసులు తిప్పుతున్నామని, దసరాకు అదనంగా 15 ప్రత్యేక బస్సులు నడుపుతామన్నారు. ఈ నెల 18 నుంచి 23 వరకు, హైదరాబాద్ నుంచి తిరుగు ప్రయాణంలో 24 నుంచి 27 వరకు 15 సర్వీసులు అమలాపురం నుంచి నడుపుతున్నట్లు తెలిపారు. ఇప్పటికే ప్రైవేటు ఆపరేటర్లు హైదరాబాద్‌కు రూ.1,500 నుంచి రూ.1,600 ధర పెట్టారని, ఆర్టీసీలో అయితే సాధారణ చార్జీతో రూ.900కే వెళ్లవచ్చని సూచించారు. విజయవాడకు ప్రస్తుతం 30 బస్సులను నడుపుతుండగా దసరాకు అదనంగా 10 బస్సులను నడుపుతామని చెప్పారు. విశాఖపట్నం, తదితర రూట్లకు ప్రస్తుతం 49 బస్సులను నడుపుతుండగా అదనంగా 10 బస్సు సర్వీసులను నడుపుతామన్నారు. భవానీ భక్తులు కోరితే విజయవాడకు ప్రత్యేక బస్సులు నడుపుతామని చెప్పారు. శబరిమలైకు కూడా హైటెక్ సూపర్ లగ్జరీ బస్సులను నడపనున్నామని చెప్పారు.

చార్జిలో 10 శాతం రాయితీ

ప్రయాణికులు ఒకేసారి రానుపోను టికెట్లు తీసుకుంటే చార్జిలో 10 శాతం రాయితీ ఇస్తున్నట్టు తెలిపారు. హైదరాబాద్‌కు రానుపోను టికెట్లు ఒకేసారి తీసుకుంటే రూ.180 వరకు తగ్గుతుందన్నారు.

మహిళల అభ్యున్నతికే చేయూత మార్ట్‌లు



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీ మహిత

ఉప్పలగుప్తం: మహిళల అభ్యున్నతికే చేయూత మహిళా మార్ట్‌లను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేస్తున్నారని రాష్ట్ర సెర్ప్, చేయూత అడిషనల్ డైరెక్టర్ ఎం.మహిత అన్నారు. స్థానిక మహిళా స్వయం శక్తి భవనంలో మండల వీవోఏలకు, అధికారులకు గురువారం సమావేశం నిర్వహించారు. మహిళలు ఏర్పాటు చేసిన చేయూత మహిళామార్ట్ విక్రయాలు పెంచేలా వారికి అవగాహన కల్పించారు. మార్ట్‌ను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. కాకినాడ జిలా తాళ్లరేవు మార్ట్ లాభాలతో పనిచేస్తుందని, ఉప్పలగుప్తం మార్ట్ అమ్మకాల్లో వెనుకబడి ఉందని అన్నారు. డీఆర్‌డీఏ ఏపీడీ ఎస్.ఎస్.జిలానీ, డీపీఎంలు జి.విజయ్‌కుమార్, ఎం.సామ్యేల్, ఏపీఎం కె.వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

గుడ్డు..సూపర్ ఫుడ్


- ఉత్పత్తిలో రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచిన ఉమ్మడి 'తూర్పు'
- 200కు పైగా పౌల్ట్రీలు.. 2.3 కోట్ల కోళ్ల పెంపకం
- రోజుకు 1.04 కోట్ల గుడ్లు ఉత్పత్తి
- 60 శాతం ఉత్తరాది రాష్ట్రాలకు ఎగుమతి
- నేడు ప్రపంచ గుడ్డు దినోత్సవం

మండపేట: చూడటానికి గుప్పెడంత మాత్రమే ఉండే గుడ్డులో పోషకాలు పుష్కలం. అనేక విటమిన్లు, మినరల్స్, ప్రోటీన్లు కలిగిన సూపర్ ఫుడ్‌గా గుడ్డును పేర్కొంటారు నిపుణులు. భారత పౌష్టికాహార సంస్థ గుర్తించిన 650 ఆహార పదార్థాల్లో గుడ్డు మొదటిది కావడం గమనార్హం. శరీరానికి ఆరోగ్యాన్ని అందించే గుడ్డు ఎంతోమందికి ఉపాధి చూపుతోంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ప్రధాన రంగాల్లో ఒకటిగా పౌల్ట్రీ నిలిచింది. రోజుకు 1.04 కోట్ల గుడ్ల ఉత్పత్తితో జిల్లాను రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిపారు ఇక్కడి కోళ్ల రైతులు. శుక్రవారం ప్రపంచ గుడ్డు దినోత్సవం సందర్భంగా జిల్లాలో కోళ్ల పరిశ్రమపై ప్రత్యేక కథనం...

రెండు దశాబ్దాల క్రితం లండన్ కేంద్రంగా ప్రపంచ దేశాలతో అంతర్జాతీయ గుడ్ల సమాఖ్య (ఐఈసీ) ఆవిర్భవించింది. ఆరోగ్య పరిరక్షణలో గుడ్డు ప్రాధాన్యతను వివరించడమే లక్ష్యంగా ఏటా అక్టోబర్ రెండవ శుక్రవారం ఐఈసీ ప్రపంచ గుడ్డు దినోత్సవం నిర్వహిస్తోంది. జాతీయ గుడ్ల సమన్వయ కమిటీ (ఎన్ఈసీసీ) ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా వరల్డ్ ఎగ్ డే నిర్వహిస్తుంటారు.

పోషకాలు ఇలా..

- **50 గ్రాముల గుడ్డులో ఎనర్జీ 72 కేలరీలు ఉంటే, 6.3 గ్రాముల ప్రొటీన్లు, 4.8 గ్రాముల కొవ్వు,** 28 గ్రాముల కాల్షియం, 0.9 గ్రాముల ఐరెన్, విటమిన్ ఏ 270 ఐయూ, విటమిన్ డి 41ఐయూ ఉంటాయి. శరీరానికి కావాల్సిన మరెన్నో పోషకాలు గుడ్డులో లభిస్తాయి.
- గుడ్డులో ఉండే విటమిన్ ఏ ఆరోగ్యకరమైన కణాల వృద్ధికి, చర్మం, కళ్లు వాటి కణజాలాలకు ఎంతో అవసరం.
- గుడ్డులో ఉండే విటమిన్ బి–12 ఎర్ర రక్తకణాల తయారీకి, వ్యాధి నిరోధక శక్తి పెంపొందించడానికి, మెదడు, నాడీ వ్యవస్థ సక్రమంగా పనిచేయడానికి ఉపయోగపడుతుంది.
- కొలిన్ శరీరంలోని నాడీ, కండరాల వ్యవస్థలు సక్రమంగా పనిచేయడానికి దోహదపడుతుంది.
- ఫోలిక్ ఆసిడ్ ఎర్ర రక్తకణాల తయారీకి, గర్భవతుల్లో పిండం పెరుగుదలకు, ఐరన్ శరీరంలో ఆక్సిజన్ సరఫరాకు ఉపయోగపడుతుంది. అలాగే కండరాల నిర్మాణం, అవయవాలు, చర్మం, ఇతర కణజాలాల నిర్మాణానికి, హార్మోనులు, ఎంజైములు, ఆంటీబాడీల తయారీకి గుడ్డు ఎంతో మేలు చేస్తుంది.
- గుడ్డులోని సెలీనియం ఆరోగ్యకరమైన రోగ నిరోధక శక్తిని పెంపొందించడంలో ఉపయోగపడుతుంది.
- ఆరోగ్యకరమైన ఎముకలు, పళ్ల నిర్మాణానికి శరీరానికి అవసరమైన కాల్షియాన్ని అందిస్తుంది. ఇవే కాకుండా మరెన్నో ప్రయోజనాలు గుడ్డు వలన కలుగుతాయంటున్నారు నిపుణులు. ప్రతీ రోజు ఒక గుడ్డు తీసుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన జీవనం సాగించవచ్చునంటున్నారు.



వేలాది మందికి ఉపాధి

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని మండపేట, అనపర్తి, ద్వారపూడి, బలభద్రపురం, పెద్దాపురం, రావులపాలెం, రాజమహేంద్రవరం రూరల్ ప్రాంతాల్లో కోళ్ల పరిశ్రమ విస్తరించింది. 200 పౌల్ట్రీలు ఉండగా గుడ్లు పెట్టేవి, పిల్లలు తదితర దశల్లో దాదాపు 2.3 కోట్ల కోళ్లు ఉన్నాయి. గుడ్లు పెట్టే కోళ్లు దాదాపు 1.3 కోట్ల వరకు ఉండగా రోజుకు 1.04 కోట్ల గుడ్లు ఉత్పత్తి అవుతున్నాయి. రాష్ట్రంలో అత్యధిక గుడ్లు ఉత్పత్తి జిల్లాలోనే జరుగుతుండటం గమనార్హం. జిల్లా ఉత్పత్తిలో 60 శాతం గుడ్లు పశ్చిమ బెంగాల్, ఒడిశా, బిహార్, అస్సాం తదితర రాష్ట్రాలకు ఎగుమతి అవుతుండగా మిగిలినవి స్థానికంగా వినియోగమవుతున్నాయి. కోళ్లకు మేత వేయడం, నీళ్లు పెట్టడం, మందులు అందజేయడం, గుడ్ల రవాణా, మార్కెటింగ్ తదితర విభాగాల్లో ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మంది ఈ రంగంపై ఆధారపడి జీవిస్తున్నారు.

పోషకాలు పుష్కలం



శరీరానికి అవసరమైన పౌష్టికాహారాన్ని అందించడంలో గుడ్డు ఎంతో మేలు చేస్తుంది. ఉడికించిన గుడ్డులో పొటాషియం, ఐరన్, జింక్, విటమిన్స్ పుష్కలంగా ఉంటాయి. గుడ్డులో మాంసకృత్తులు సమృద్ధిగా ఉండడం వల్ల ఆరోగ్యవంతంగా ఎదిగేందుకు, కండర నిర్మాణానికి ఎంతో మేలు చేస్తుంది. ప్రతిరోజూ ఒక ఉడికించిన గుడ్డును తీసుకోవడం వల్ల శరీరానికి అవసరమైన శక్తి లభిస్తుంది.

– పడాల సుబ్బారెడ్డి, ఏపీ పౌల్ట్రీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, అర్తమూరు.

క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీలకు హర్షవర్ధిని

అంబాజీపేట: రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీలకు పుల్లేటికుర్రు జెడ్పీ హైస్కూల్‌లో 7వ తరగతి చదువుతున్న చీకురుమిల్లి హర్షవర్ధిని ఎంపికైనట్లు హెచ్‌ఎం కె.సూర్యకనక దుర్గ, పీడీ అందె సూర్యనారాయణ తెలిపారు. ఈ నెల 10వ తేదీన కాకినాడలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా స్థాయి 3,000 మీటర్ల రన్నింగ్ పోటీల్లో ద్వితీయ స్థానం సాధించిందని గురువారం తెలిపారు. రన్నింగ్‌లో అత్యంత ప్రతిభ కనబర్చిన హర్షవర్ధిని రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపికైందన్నారు. ఉపాధ్యాయుడు వి.బలరామకృష్ణ సమకూర్చిన రన్నింగ్ షూను విద్యార్థికి బహూకరించారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థిని సర్పంచ్ జల్లి బాలరాజు, ఎంపీటీసీ సభ్యులు కుసుమ వెంకటేష్, వడలి కృష్ణమూర్తి, పబ్బిసీడి రాంబాబు, సొసైటీ అధ్యక్షుడు నందుల ఆదినారాయణ, పీఎంసీ చైర్మన్ మద్రి ఏడుకొండలు అభినందనలు తెలిపారు.

యువకుడి దుర్మరణం

ఆలమూరు: మండలంలోని మడికిలోనున్న 216(ఏ) నంబరు జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో పాలపర్తి రోబిన్ (19) మృతి చెందాడు. పశ్చిమ గోదావరి జిల్లా మొగల్తూరు మండలం కామాటితిప్ప గ్రామానికి చెందిన రోబిన్ తన నలుగురు మిత్రులతో కలిసి కారుపై విహారయాత్రకు విశాఖపట్నం వెళ్లి తిరుగు ప్రయాణమయ్యాడు. అందులో భాగంగా స్థానిక పెట్రోల్ బంక్ సమీపం వద్దకు చేరుకునేసరికి అదే మార్గంలో రోడ్డుపై నిలిపి ఉన్న భారీ లారీని రోబిన్ తన కారుతో వెనుక నుంచి బలంగా ఢీకొట్టాడు. తీవ్ర గాయాల పాలయిన రోబిన్‌ను పోలీస్, నేషనల్ హైవే సిబ్బంది సహకారంతో ఎన్ హెచ్ అంబులెన్స్‌లో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. స్నేహితులకు పాక్షిక గాయాలయ్యాయి. ఎస్సై శ్రీనివాస్ నాయక్ కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్రీడాకారుల ఎంపికలు రేపు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బాల్ బ్యాడ్మింటన్ సంఘం ఆధ్వర్యంలో శనివారం జూనియర్స్ బాల్ బ్యాడ్మింటన్ జట్టు ఎంపికను నిర్వహిస్తున్నట్లు నిర్వహణ సంఘ కార్యదర్శి వీకేఆర్ తంబి గురువారం తెలిపారు. ఎంపిక బిక్కవోలు జిల్లాపరిషత్ స్కూల్ ఆవరణలో మధ్యాహ్నం ఒంటి గంటకు ప్రారంభమవుతుంది.



హై..హై.. జగనన్నా..


జై జగన్ అంటూ రయ్ రయ్ మంటూ

గుండెల్లో గూడు కట్టిన అభిమానం

తమ సొంతింటి కలను సాకారం చేసిన జగనన్నపై జనం అభిమానం వెల్లువెత్తింది. 'నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు' పథకంలో నిర్మించిన జగనన్న ఇళ్ల ప్రారంభోత్సవానికి గురువారం కాకినాడ జిల్లా సామర్లకోట వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జనం బ్రహ్మరథం పట్టారు. అడుగడుగునా పూలు జల్లుతూ స్వాగతించారు. ప్లకార్డులలో పలు నినాదాలు రాసి తమ ఆప్యాయతను చాటుకున్నారు. ఆయన ప్రసంగిస్తున్నంత సేపూ చప్పట్లు కొడుతూ, జై జగన్ నినాదాలు చేస్తూ, తమ సెల్‌ఫోన్లలో ఫొటోలు తీసుకుంటూ మురిసిపోయారు. తమ గుండెల్లో గూడు కట్టిన అభిమానాన్ని పలు రకాలుగా ప్రదర్శించారు. - సామర్లకోట


కలల లోగిళ్లకు గలగలా నవ్వుతూ..


క్లిక్‌మన్న అభిమానం


పూలకించిన ఆప్యాయత


పుట్టింటి పట్టుచీర


జగన్ మామకు జైజై

జన సునామీ

7వ పేజీ తరువాయి ▶

ప్రశంసించడం పార్టీ శ్రేణుల్లో జోష్ నింపింది. చంద్రబాబు ఇటీవల పెద్దాపురం వచ్చినప్పుడు జగన్ ముఖం చూస్తే ఓట్లేయరన్న విషయాన్ని ప్రస్తావించి.. 'జగన్ అలా కనిపిస్తున్నారా?' అని దొరబాబు ప్రజలను ప్రశ్నించారు. చంద్రబాబును చూస్తే స్కాములు.. జగన్‌ను చూస్తే స్కీములు గుర్తుకు వస్తాయంటూ వారికి చురకలు అంటించినప్పుడు సభా ప్రాంగణంలో జై జగన్ అనే నినాదాలు మిన్నంటాయి.

అందరితో మమేకమవుతూ..

సామర్లకోటలో జగనన్న లే అవుట్‌లో ఇళ్లను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయడంలో కలెక్టర్ కృతికా శుక్లా చూపిన చొరవను సీఎం వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి ప్రశంసించారు. కార్యక్రమం అనంతరం సొంతంగా తయారు చేయించిన ఇంటి నమూనాను సీఎంకు కలెక్టర్ కృతికా శుక్లా అందచేశారు. ప్రసంగం అనంతరం వేదిక పైకి వచ్చిన మహిళలు సెల్ఫీ దిగేందుకు ప్రయత్నించే సందర్భంలో వీలు కాకపోవడంతో.. సీఎం జగనే స్వయంగా మొబైల్ అందుకుని సెల్ఫీ తీయడంతో వారి ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. పెద్దాపురం నియోజకవర్గంలోని పలు సమస్యలను సీఎం దృష్టికి తీసుకురావడం ద్వారా నిధులు రాబట్టడంలో దొరబాబు కృతకృత్యులవ్వడం పార్టీ కేడర్‌లో జోష్ నింపింది. లబ్ధిదారులైన మహిళలతో గృహ ప్రవేశం చేసిన దగ్గర నుంచి ప్రసంగం ముగించి వేదిక దిగే వరకు సీఎం ముఖంలో చెరగని చిరునవ్వులే కనిపించాయి. ప్రజలను పలకరిస్తూ అభివాదాలు చేస్తూ ముందుకు సాగారు. రెండుమూడు పర్యాయాలు వాయిదా పడిన సామర్లకోట కార్యక్రమం నభూతో.. అనే రీతిలో విజయవంతం కావడం అటు జిల్లా యంత్రాంగం, ఇటు పార్టీ శ్రేణుల్లో ఉత్తేజాన్ని నింపింది. సీఎం పర్యటన సందర్భంగా హెలిప్యాడ్ నుంచి ఆంజనేయ స్వామి ఆలయం, అక్కడి నుంచి ఈటీసీ సెంటర్, జూనియర్ కాలేజీ, మరోవైపు సామర్లకోట - పెద్దాపురం, సామర్లకోట - కిర్లంపూడి ప్రధాన రహదారుల వెంబడి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన తప్పెటగుళ్ల వంటి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

నేతలు హాజరు

సీఎం పర్యటనలో మంత్రులు జోగి రమేష్, దాడిశెట్టి రాజా, డాక్టర్ సీదిరి అప్పలరాజు, పినిపే విశ్వరూప్, చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, ఎంపీలు పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, పిల్లి సుభాష్‌చంద్రబోస్, వంగా గీత, మార్గాని భరత్‌రామ్, సీఎం ప్రోగ్రాం కో ఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, ఎమ్మెల్సీలు అనంతబాబు, బొమ్మి ఇజ్రాయెల్, ఎమ్మెల్యేలు కురసాల కన్నబాబు, పొన్నాడ వెంకట సతీష్‌కుమార్, ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, పెండెం దొరబాబు, పర్వత శ్రీపూర్ణచంద్ర ప్రసాద్, జ్యోతుల చంటిబాబు, డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, కొండేటి చిట్టిబాబు, తలారి వెంకట్రావు, నాగులాపల్లి ధనలక్ష్మి, కలెక్టర్ కృతికా శుక్లా, కాకినాడ నగరాభివృద్ధి సంస్థ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, రాజమహేంద్రవరం నగరాభివృద్ధి సంస్థ మాజీ చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, కార్పొరేషన్ చైర్మన్లు తాడి విజయభాస్కరరెడ్డి, ఆవాల రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

'నన్నయ'కు ఒకేసారి మూడు ఐఎస్‌ఓ సర్టిఫికెట్లు


హిమ్ అధిపతి శివయ్య నుంచి ఐఎస్‌ఓ సర్టిఫికెట్లు అందుకుంటున్న 'నన్నయ' వీసీ ఆచార్య పద్మరాజు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీకి ఒకేసారి మూడు ఐఎస్‌ఓ సర్టిఫికెట్లు లభించాయి. యూనివర్సిటీలోని ఈసీ హాలులో గురువారం జరిగిన ఐఎస్‌ఓ సమావేశంలో హిమ్ (హెచ్‌వైఎం) ఇంటర్నేషనల్ సర్టిఫికేషన్స్ సంస్థ అధిపతి ఆలపాటి శివయ్య, 'నన్నయ' వీసీ ఆచార్య కె.పద్మరాజుకు ఈ మూడు సర్టిఫికెట్లను అందజేశారు. అవసరాలకు అనుగుణంగా ఎనర్జీ నిర్వహణ వ్యవస్థను అమలు చేసినందుకుగాను ఎనర్జీ మేనేజ్‌మెంట్ సిస్టమ్ సర్టిఫికేషన్ ఐఎస్‌ఓ 50001:2018, పర్యావరణ నిర్వహణ వ్యవస్థను అమలు చేసినందుకు ఎనర్జీ మేనేజ్‌మెంట్ సిస్టమ్ సర్టిఫికేషన్ ఐఎస్‌ఓ 14001:2015, జెండర్ సెన్సిటైజేషన్ ఆడిట్‌ని అమలు చేసినందుకు జెండర్ సెన్సిటైజేషన్ సర్టిఫికేషన్ ఐఎస్‌ఓ 22325:2020 లభించడం హర్షణీయమని వీసీ పేర్కొన్నారు. సమావేశంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ఐక్యూఏసీ డైరెక్టర్ డాక్టర్ వి.పెర్సిస్, ఫ్యాకల్టీ అసోసియేట్ డాక్టర్ ఎస్. మురళీమోహన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

రెజ్లింగ్‌లో రాణించి జిల్లాకు పేరు తేవాలి

- ఒలింపిక్ సంఘ అధ్యక్షుడు వీరభద్రారెడ్డి
- ఉమ్మడి తూర్పుగోదావరి నుంచి ఆరుగురు రాష్ట్ర జట్టుకు ఎంపిక

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): జాతీయ స్థాయి రెజ్లింగ్ పోటీలలోరాణించి జిల్లాకు మంచి పేరు తేవాలని కాకినాడ జిల్లా ఒలింపిక్ సంఘ అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి పేర్కొన్నారు. గురువారం కాకినాడ పీఆర్ డిగ్రీ కళాశాలలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రెజ్లింగ్ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ క్రీడాకారుల ఎంపికలు జరిగాయి. ఈ ఎంపికలకు వీరభద్రారెడ్డి ముఖ్యఅతిథిగా, ఒలింపిక్ సంఘ చైర్మన్ చుంద్రుగోవిందరాజు, ఒలింపిక్ సంఘ ప్యాట్రన్ కర్రిభామిరెడ్డి గౌరవ అతిథులుగా పాల్గొన్నారు. రెజ్లింగ్ సంఘ అధ్యక్షుడు డాక్టర్ జి.ఎలీషాబాబు మాట్లాడుతూ గోవాలో ఈ నెల 19 నుంచి నవంబర్ 6 వరకు జరిగే జాతీయ స్థాయి రెజ్లింగ్ పోటీలకు ఆంధ్రప్రదేశ్ జట్టు ఎంపికను నిర్వహించామన్నారు. రాష్ట్ర జట్టులో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి ఆరుగురు క్రీడాకారులకు అవకాశం దక్కిందన్నారు. ఫ్రీ స్టైల్, గ్రీకో రోమన్ విభాగాల్లో నిర్వహించిన ఎంపికలకు రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి 100 మంది క్రీడాకారులు హాజరయ్యారన్నారు. ముఖ్యఅతిథి వీరభద్రారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి ఎంపికలకు విచ్చేసిన క్రీడాకారులను ఆయన అభినందించారు. ఈ ఎంపికల్లో పీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ తిరుపాణ్యం, ప్రతిభా విద్యానికేతన్ కార్యదర్శి ప్రకాష్, ఒలింపిక్ సంఘ సభ్యుడు కృష్ణమూర్తి, తైక్వాండో సంఘ కార్యదర్శి బి.అర్జునరావు, ఒలింపిక్ సంఘ కోశాధికారి కొండలరావు, పీడీలు డాక్టర్ వర్మ, రమణ, జార్జి, కౌర్, రెజ్లింగ్ సంఘం నుంచి జిల్లా కార్యదర్శి మూర్తి, కోచ్ దుర్గ పాల్గొన్నారు.


రెజ్లింగ్ ఎంపికలను లాంఛనంగా ప్రారంభిస్తున్న వీరభద్రారెడ్డి తదితరులు

రాష్ట్ర జట్టు ఇదే...

పురుషుల ఫ్రీ స్టైల్ విభాగంలో పి.ప్రవీణ్‌కుమార్ (నెల్లూరు), కె.ప్రభుతేజ (చిత్తూరు), గ్రీకో రోమన్‌లో బి.సుభాష్ (కాకినాడ), ఎ.వెంకట ప్రవీణ్(కాకినాడ), పి.నాగరాజు (పల్నాడు) ఎంపికయ్యారు.

మహిళల విభాగంలో బి.కావ్య (కాకినాడ), ఎస్.రమాదేవి (కోనసీమ), ఎస్‌కే నూర్‌జహాన్ (గుంటూరు), ఎం.సౌమ్యసుజని (కాకినాడ), యు.మీనుసారిఖ (అల్లూరి సీతారామ రాజు జిల్లా)లు ఎంపికయిన వారిలో ఉన్నారు.

మీ ప్రోత్సాహం ఉంటే... అవకాశాలెన్నో

- కేంద్ర బృందాన్ని కోరిన జిల్లా యంత్రాంగం
- ఒక జిల్లా.. ఒక ఉత్పత్తిగా కొబ్బరి
- ఇన్వెస్ట్ ఇండియా బృందం పర్యటన

సాక్షి అమలాపురం: 'మీరు ప్రోత్సహిస్తే కొబ్బరి విలువ ఆధారిత పరిశ్రమల ఏర్పాటుకు జిల్లాలో అపార అవకాశాలున్నాయి. పరిశ్రమలు ఏర్పాటు చేస్తే యువతకు, మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించడమే కాదు... పంట పండించే రైతుకు లాభసాటి ధర వస్తుంది' అని జిల్లా యంత్రాంగం కేంద్ర బృందానికి వివరించింది. ఒక జిల్లా... ఒక ఉత్పత్తి (వన్ డిస్ట్రిక్ట్... వన్ ప్రొడక్ట్)లో భాగంగా డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లాను కొబ్బరికి ఎంపిక చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇక్కడ పరిశ్రమలు పెట్టే అవకాశాన్ని, పంట విధానం.. ఇప్పుడున్న పరిశ్రమలు, వాటి వల్ల కలుగుతున్న ఉపాధి, వారికి వస్తున్న లాభాలు. పరిశ్రమలు పెడితే జరిగే మేలు' వంటి వాటిని పరిశీలించేందుకు ఇన్వెస్ట్ ఇండియా విశ్వవిద్యాలయానికి చెందిన హరి ప్రీత్‌సింగ్ నేతృత్వంలోని కేంద్ర బృందం జిల్లాలో గురువారం పర్యటించింది.

తొలుత ఈ బృందానికి కలెక్టరేట్‌లో కలెక్టర్ హిమాన్షు శుక్లా పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా జిల్లాలోని కొబ్బరి గురించి సమగ్ర సమాచారం అందించారు. కలెక్టర్ మాట్లాడుతూ కొబ్బరి విలువ ఆధారిత పరిశ్రమల ప్రోత్సాహానికి పూర్తిగా సహాయ సహకారాలు అందించాలన్నారు. కొబ్బరి సాగు, విలువ ఆధారిత పరిశ్రమల అవశ్యకతపై రూపొందించిన ప్రాజెక్ట్ రిపోర్ట్‌పై అవగాహన కల్పించారు. జిల్లాలో అన్ని శాఖల సమన్వయంతో పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని, దీనికి కేంద్రం తోడ్పాటు ఉండాలన్నారు.

కేంద్ర బృందం తొలుత ముమ్మిడివరం వద్ద ఉన్న వర్జిన్ కోకోనట్ ఆయిల్ యూనిట్‌ను సందర్శించింది. పరిశ్రమ ఏర్పాటుకు అయిన పెట్టుబడి, ఎంత ఉత్పత్తి జరుగుతోంది, మార్కెటింగ్ విధానం, అమ్మకాలు, లాభాల వివరాలను సేకరించారు. ఇదే ఉత్పత్తికి సంబంధించి పెద్ద పరిశ్రమల ఏర్పాటు చేయడంపై వారు చర్చించారు. అనంతరం అమలాపురం మండలం పేరూరులో స్వయం సహాయక సంఘాల మహిళలతో ఏర్పాటు చేసిన కొబ్బరి తాళ్ల తయారీ ఇండస్ట్రీని, అక్కడే ఉన్న కొబ్బరి ప్యాక్ హౌస్‌ను సందర్శించారు. వారితో ముఖాముఖీ చర్చించారు. పరిశ్రమ ఏర్పాటు తరువాత మహిళలకు వస్తున్న ఆదాయంపై ఆరా తీశారు. ఉత్పత్తుల తయారీ పెట్టుబడి, రాబడి, ప్రభుత్వం, వివిధ సంస్థల నుంచి అందుతున్న ప్రోత్సాహం, రాయితీ వంటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. తరువాత మామిడికుదురు మండలం పాశర్లపూడి, పెదపట్నంలంక గ్రామాల్లో పర్యటించిన బృందం క్వాయర్ బొమ్మలు యూనిట్‌లను సందర్శించింది. పాశర్లపూడిలో నాబార్డ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొబ్బరి పీచుతో తయారు చేసే బొమ్మల దుకాణంలో తయారీదారులతో మాట్లాడారు. పెదపట్నంలంకలో కోనసీమ కొబ్బరి ఉత్పత్తి దారు సంఘం యూనిట్‌ను సందర్శించారు.

డీఐసీ క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (ఎంఎస్ఎంఈ)లో భాగంగా కోనసీమ కొబ్బరి ఉత్పత్తి దారుల సంఘానికి రూ.10 కోట్ల విలువైన ప్రాజెక్టును 90 శాతం రాయితీతో మంజూరయ్యిందని అక్కడ సభ్యులు తెలిపారు. జిల్లా ఉద్యాన శాఖ అధికారి బి.వి.రమణ, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ వరప్రసాద్, డీఆర్‌డీఏ పీడీ వి.శివశంకర్, జిల్లా చేనేత, జౌళి శాఖ అధికారి రాజు, లీడ్ బ్యాంకు మేనేజర్ శ్యాంబాబు, నాబార్డు ఏజీఎం సోమినాయుడుతోపాటు పలువురు పాల్గొన్నారు.


ముమ్మిడివరంలో వర్జిన్ కోకోనట్ ఆయిల్ పరిశ్రమను పరిశీలిస్తున్న ఇన్వెస్ట్ ఇండియా విశ్వవిద్యాలయానికి చెందిన హరి ప్రీత్‌సింగ్ బృందం సభ్యులు, కలెక్టర్ శుక్లా

బాడీ స్ప్రే తెచ్చిన తంటా..

పి.గన్నవరం: మండలంలోని ముంజవరపుకొట్టు జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం మధ్యాహ్నం ఒక విద్యార్థి తన దుస్తులకు బాడీ స్ప్రే కొట్టుకుని వచ్చాడు. దాని వాసనకు ఎనిమిది మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. దీంతో వారందరినీ ఉపాధ్యాయులు పి.గన్నవరం సీహెచ్‌సీకి హుటాహుటిన తరలించారు. ఎనిమిది మంది విద్యార్థులు కోలుకోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి.. ముంజవరపుకొట్టు ఉన్నత పాఠశాలలో గురువారం మధ్యాహ్నం ఒంటిగంటన్నర సమయంలో ఒక పదో తరగతి విద్యార్థి ఇంటి దగ్గర తన దుస్తులకు బాడీ స్ప్రే కొట్టుకుని పాఠశాలకు వచ్చాడు. అతడు 4,6, 7 తరగతుల విద్యార్థులు ఉన్న గదిలోకి పుస్తకం కోసం వచ్చి తిరిగి వెళ్లాడు. అతడు వెళ్లిన కొంత సేపటికి ఆ వాసనను భరించలేక, ఊపిరి ఆడక విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. దీనిని గమనించిన పాఠశాల హెచ్‌ఎం జి.రవికుమార్ హుటాహుటిన వారందరినీ తోటి ఉపాధ్యాయులు, స్థానికుల సహకారంతో పి.గన్నవరం సీహెచ్‌సీకి తరలించారు. డాక్టర్ డి.సురేంద్ర, సిబ్బంది సకాలంలో విద్యార్థులకు వైద్య సేవలు అందించారు. అస్వస్థతకు గురైన నాల్గవ తరగతి విద్యార్థులు పెసంగి ఉమామహేశ్వరి, కాప ఇస్కియా పాల్, ఆరవ తరగతి విద్యార్థులు మట్టపర్తి ప్రసన్న, గుడాల జాహ్నవి, ఏడవ తరగతి విద్యార్థులు కోసూరి మానస, సబ్బితి నందిని, కొపనాతి లలితశ్రీ, తొత్తరమూడి సతీష్‌కుమార్‌లకు డాక్టర్లు చికిత్స అందించారు. ఐదుగురు విద్యార్థులు గంటలోపే కోలుకున్నారు. వీరిలో మానస, నందిని, సతీష్‌కుమార్‌లు చికిత్స పొందుతున్నారు. విద్యార్థులంతా కోలుకున్నారని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని డాక్టర్ సురేంద్ర తెలిపారు. కలెక్టర్ హిమాన్షు శుక్లా ఫోన్‌లో విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు, డీసీహెచ్‌ఎస్ పద్మశ్రీ రాణి, డీఈఓ కమల కుమారి, తహసీల్దార్ జి.రవీంద్రనాథ్ ఠాగూర్, ఎంపీడీఓ ఎం.భారతి విద్యార్థులను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని డాక్టర్ సురేంద్రను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో మాట్లాడారు.


అస్వస్థతకు గురైన విద్యార్థిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు